

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్



"**నా భార్యకి** చెవుడు వచ్చినట్లు నాకు అనుమానంగా ఉంది డాక్టర్.." చెప్పాడు జంబులింగం.

"ముందుగా ఇంటిదగ్గర ఈ పరీక్షచేయండి. మీ ఆవిడ వంటగదిలో అన్నం వండుతున్నప్పుడు ముందర పదిహేను అడుగుల దూరంలో నిలబడి 'అన్నంలోకి ఏంచేస్తున్నావు?' అని అడగండి. సమాధానం రాకపోతే ఈ సారి పదడుగుల దూరంలోకి వెళ్ళి మళ్ళీ అదే ప్రశ్న అడగండి. అప్పటికి జవాబురాకపోతే అయిదడుగుల దూరంలో నిలబడి మళ్ళీ అడగండి. అప్పటికీ ఆమె నుంచి సమాధానం రాకపోతే ఈ సారి ఆమెకి అతిదగ్గరగా నుంచుని అడగండి. ఆమె ఆ ప్రశ్నకి ఎంతదూరంనుంచి జవాబు చెప్పిందో నాకు చెప్పండి.."

అందుకు సమ్మతించి భర్త యింటికి వెళ్ళాడు. సరిగ్గా అదే సమయంలో ఆమె వంటగదిలో వంటచేస్తూ కనిపించింది. జంబులింగం ఆమెకి పదిహేను అడుగుల దూరంలో నిలబడి అడిగాడు.

"ఈ రోజు అన్నంలోకి ఏం చేస్తున్నావు?"

ఆమె నుంచి సమాధానం రాకపోవడంతో ఈ ఐదడుగులు ముందుకేసి అదే ప్రశ్న అడిగాడు. ఉహుఁ.. ఫలితంలేదు. మరో ఐదడుగులు ముందుకెళ్ళి అడిగినా ఆమె నుంచి సమాధానం రాలేదు. ఇంక చివరగా ఆమెకి పక్కన నుంచుని అడిగాడు " ఈ రోజు వంటలోకి ఏం చేస్తున్నావు?"

"పప్పుచారని మూడుసార్లు చెప్పాను. వినబడి చావడం లేదా?"

★★★

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ఒరే నందూ! 'బ్యూటిఫుల్' అంటే ఏమిటి?"

"తెలియదండీ."

"నువ్వు చెప్పరా బాలూ."

"సౌందర్యము"

"ఇంకా?"

"అందమైనది"

"శభాష్.. నందూ ఇప్పుడు చెప్పు 'బ్యూటిఫుల్' అంటే ఏమిటి?"

"జయమాలిని."

"ఒరేయ్ రాజూ! నువ్వు రోజూ అన్నం తిన్న తర్వాత మూతి కడుక్కోవెందుకు? నీ మొఖం చూస్తేనే తెలుస్తుంది నువ్వీరోజు ఏం తినొచ్చావో?" కోపంగా అన్నాడు టీచర్.

"చెప్పండి చూద్దాం?"

"మైసూర్‌పాక్"

"తప్పుసార్! అది తిన్నది మొన్నగదా"

"ప్రియా! నిన్ను పెళ్ళి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటావా?" అడిగింది ప్రియురాలు.

"ఇలాంటి ప్రశ్న వచ్చినప్పుడు సాధారణంగా అలానే చెబుతుంటాను" శూన్యంలోకి చూస్తూ చెప్పాడు ప్రియుడు.

ఓ పత్రికా ప్రకటన ఇలా ఉంది. "రామయ్య అనే జడ్జిగారు తప్పిపోయారు. ఆయన్ను వెదికి తెచ్చిన వారికి మంచి నగదు బహుమతుంటుంది. బహుశా ఆయన సముద్రస్నానం చేస్తున్నప్పుడు నీళ్ళలో కొట్టుకుపోయి వుండవచ్చని భావిస్తున్నారు. తప్పిపోయిన జడ్జిగారి

వివరాలు ఇవి... ఆరడుగుల ఎత్తు, నీలికళ్ళు, బట్టతల, నల్లరంగు సూటులో ఉంటాడు. మాట్లాడేప్పుడు సుత్తితో కొదుతుంటాడు"

"ఆ సుబ్బారావు ఎలా బతుకుతున్నాడో అర్థం కావడం లేదు. మొన్న, నిన్న ఈ రోజు కూడా వాడి పర్సు ఖాళీ. వెధవ దగ్గర ఒక పైసా కూడా లేదు."

"నీకెలా తెలుసు? నీ దగ్గరికేమైనా అప్పుకోసం వచ్చాడా?"

"అబ్బే...లేదు. నేనే వాడి దగ్గరకు అప్పుకోసం వెళ్ళాను."

"ఏమండీ రాత్రి మీరు నా మెళ్ళో ఓ నెక్లెస్ తగిలించినట్లు కలొచ్చింది. దాని అర్థం ఏమిటంటారు?" భార్య గునుస్తూ అడిగింది భర్తను.

"దాని అర్థం సాయంత్రం తెలుస్తుందిలే" అంటూ భార్య బుగ్గమీద చిటికేసి ఆఫీసుకెళ్ళాడు భర్త.

సాయంత్రం ఆఫీసునుండి వచ్చిన భర్త నెక్లెస్ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న భార్యచేతికి బ్రీఫ్‌కేస్ అందించి "రాత్రి నీకొచ్చిన కలకు అర్థం ఏమిటో చూసుకో" అన్నాడు చిరునవ్వుతో.

ఆత్రంగా బ్రీఫ్‌కేసు తెరచిన భార్యకు అందులో "కలల అంతరార్థం" అనే పుస్తకం దర్శనమిచ్చింది.

"నేను మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను" ఇందిర తండ్రితో అన్నాడు పద్మారావు.

"అయితే వాళ్ళమ్మను కలిసి చూడు"

"కలిసానండి. నాకు యిందిరే నచ్చింది" సిగ్గుపడుతూ చెప్పాడు కాబోయే అల్లుడు.

"మీ పెళ్ళయ్యాక జీవితంలో ఏమయినా మార్పు వచ్చిందా?"

"ఇదివరలో మా ఆయన ఇంటినుండి ఆఫీసుకు బయల్దేరి వెళ్ళడం కోసం బలవంతం చేయాల్సి వచ్చేది. యిప్పుడు ఆయన పెందరాడే ఇంటికి రావడం కోసం అర్ధరాత్రివరకూ ఎదురుచూసి దెబ్బలాడవలసి వస్తోంది. అంతే"

టూరిస్టులకు ఓ శిథిలాన్ని చూపిస్తూ "ఇది రెండువేల సంవత్సరాల క్రితం నాటిది" అన్నాడు గైడ్.

"కాదు. రెండువేల మూడేళ్ళ క్రితం నాటిది" అంటూ గైడ్ మాటల్ని ఖండించాడు ఓ టూరిస్ట్.

"అంత ఖచ్చితంగా మీకెలా తెలుసు?" కోపంగా అడిగాడు గైడ్.

"మూడేళ్ళ క్రితం నేనొచ్చినప్పుడు రెండువేల సంవత్సరాల క్రితం నాటిదని మీరే చెప్పారు" అన్నాడు టూరిస్టు.

సుబ్బారావు కోసం అతనింటికి వచ్చాడు అప్పారావు.

"ఆయన లేరు" చెప్పింది సుబ్బారావు భార్య.

"పోనీ ఆయన ఎవరైనా వస్తే కూర్చోమని చెప్పారా?" ఆశగా అడిగాడు అప్పారావు.

"లేదండీ ఆయనేం చెప్పలేదు" అంది సుబ్బారావు భార్య.

"సరే లెండి. ఆయన వచ్చేవరకూ నేను నిలబడే వుంటాను" నిరాశగా అన్నాడు అప్పారావు.

COMMENTS